# ప్రజాతీర్పే శిరోధార్యం

- కేసీఆర్ పాలనలో ప్రతి పల్లెలో అభివృద్ధి
- ఓటమికి గల కారణాలపై చర్చిస్తాం
- ప్రజాసమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తాం..
- కేసీఆర్ ఆదర్శ పాలన చరిత్రలో లిఖించబడుతుంది..
- ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు



పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రవీందర్‌రావు

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 4 : అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పే శిరోధార్యమని భావిస్తామని ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్ రావు అన్నారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్య దేశంలో ఓటు అనేది ఆయుధమని, తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు, అభివృద్ధిలో కేసీఆర్ పాత్ర చాలా కీలకమన్నారు. తెలంగాణ ప్రజల అభివృద్ధి కోసం కేసీఆర్ అనేక పథకాలు అమలు చేశాడని అన్నారు. ఈ తొమ్మిదేళ్ల కాలంలో తెలంగాణలో జరిగిన అభివృద్ధి దేశ చరిత్రలో లిఖించబడుతుందన్నారు. హైదరాబాద్, దాని చుట్టూ ఉన్న జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ ఘన విజయం సాధించిందని, మిగతా జిల్లాల్లో అలాంటి ఫలితాలు రాలేదన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఓడిపోయినంత మాత్రన నాయకులు, కార్యకర్తలు ఎలాంటి మనోవేదనకు గురి కావొద్దన్నారు. పార్టీ ఎల్లప్పుడూ కార్యకర్తలకు అండగా ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ ధైర్యంగా ఉండాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలో ఏదైతే ఆరు గ్యారంటీలు అని చెబుతూ హామీలు ఇచ్చి గెలిచిందో వాటిని అమలు చేసే విధంగా కృషి చేస్తామన్నారు. కేసీఆర్ నేతృత్వంలో జిల్లాకు మెడికల్, ఇంజినీరింగ్, హార్టికల్చర్ కళాశాలలు, ఇతర గురుకుల పాఠశాలల భవనాలు మంజూరై నిర్మాణ దశలోనే ఉన్నాయన్నారు. ఇప్పుడు స్థానికంగా గెలిచిన ఎమ్మెల్యే ఈ అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించి మధ్యలో ఆగిపోకుండా పూర్తి చేయించాలన్నారు. జిల్లాలో ఉన్న ఉద్యమకారులు, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కారం కోసం ఉద్యమిస్తామన్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా ఉండి రానున్న సర్పంచ్, ఎంపీటీసీ, మున్సిపల్ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించాలన్నారు. నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యే స్థానిక ప్రజాసమస్యలను గుర్తించి పరిష్కరించాలని, పట్టణం చుట్టూ ఉన్న ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బానోత్ రవికుమార్, మంగళంపల్లి కన్న, జేరిపోతుల వెంకన్న, చారి, వెంకన్న పాల్గొన్నారు.



ఎర్రవల్లిలో మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును కలిసిన ఎంపీ, బీఆర్ఎస్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత, మాజీ మంత్రి సత్యవతిరాథోడ్



మరిపెడ మున్సిపల్ కేంద్రంలో మాట్లాడుతున్న ఎంపీ మాలోత్ కవిత

# కేసీఆర్ నేతృత్వంలో పట్టణం అభివృద్ధి

- ప్రజాతీర్పును గౌరవిస్తాం..
- కార్యకర్తలు అధైర్యపడొద్దు..
- ప్రజల సమస్యలపై పోరాడుతా..
- మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్

మహబూబాబాద్/ మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 4 : బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ నేతృత్వంలో మహబూబాబాద్ పట్టణం అన్ని విధాలా చెందిందని మాజీ ఎమ్మెల్యే బానో త్ శంకర్ నాయక్ అన్నారు. సోమవారం ఆయన పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అనేక పోరాటాలు చేసి కేసీఆర్ ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారని, పాలనా పగ్గాలు చేపట్టిన పదేళ్లలోనే రాష్ట్రాన్ని అభివృద్ధిలో దేశంలోనే ముందువరుసలో నిలిపారని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజల తీర్పును శిరసావహిస్తామన్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎలాంటి ఆందోళనకు గురికావొద్దని, అధికారంలో లేకపోయినా అన్ని వేళల ప్రజలకు అందుబాటులో ఉంటానని అన్నారు. నియోజకవర్గంలో సమస్యల పరిష్కారం కోసం ప్రజలతో కలిసి పోరాటం చేస్తాన్నారు. పట్టణంలో అభివృద్ధి, సంక్షేమం కొనసా గేవిధంగా కృషి చేస్తానని చెప్పారు. కేసీఆర్ ప్రత్యేకంగా మానుకోటకు మెడికల్ కళాశాల, సీసీరోడ్లు మంజూరు చేశారని, నిర్మాణ దశలోనే ఉన్న వాటిని పూర్తి చేసే పోరాటం చే యాలన్నారు. పార్టీలో చిన్నచిన్న సమస్యలున్నాయని, వాటి సరిదిద్దుకుని ముందుకు సాగుతామన్నారు. పార్టీ కార్యకర్తలు ఎలాంటి మనోవేదనకు గురికావొద్దన్నారు. రానున్న సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని గెలిపించుకునే విధంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ గ్యారంటీల హామీ ఇచ్చి గెలిచిందని, వాటిని పేదలకు అందించేవిధంగా పోరాటం చేస్తామన్నారు. రానున్న రోజుల్లో పార్టీ కార్యకర్తలు సైనికునిల్లా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. మెడికల్, ఇంజినీరింగ్, హార్టికల్చర్ కళాశాలలతో మానుకోటను ఎడ్యుకేషనల్ హబ్‌గా తీర్చిదిద్దామ న్నారు. కార్యక్రమంలో ము న్సిపల్ చైర్మన్ రామ్మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్ ఫరీద్, మార్నేని వెంకన్న, రంజిత్, యాస వెంకటరెడ్డి, అశోక్‌నాయక్, తేళ్ల శ్రీను, గద్దె రవి, రాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలకు

# అండగా ఉంటాం..

### ప్రజాతీర్పు శిరసావహిస్తాం..: ఎంపీ, జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత

మరిపెడ, డిసెంబర్ 4 : తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో ప్రజాతీర్పును శిరసావహిస్తామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, ఎంపీ మాలోత్ కవిత అన్నారు. సోమవారం మరిపెడ మున్సిపల్ కేంద్రంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్‌రావుతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గెలిచిన ఎమ్మెల్యేలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాభీష్టం మేరకు పరిపాలన కొనసాగించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ సంక్షేమం కొనసాగాలన్నదే తమ తపన అని అన్నారు. ప్రజా తీర్పుపై పునఃసమీక్షించుకుని తప్పుఒప్పులను సవరించుకుంటామన్నారు. బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు అధైర్య పడొద్దని, అనునిత్యం అండగా ఉండి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో రామడుగు అచ్చుత్‌రావు, ఎంపీపీ గుగులోత్ అరుణారాంబాబు, జడ్పీటీసీ తేజావత్ శారదారవీంద్రనాయక్, మున్సిపల్ వైస్ చైర్మన్ ముదిరెడ్డి బుచ్చిరెడ్డి, మాజీ ఎంపీపీ గుగులోత్ వెంకన్న, ఓడీసీఎంఎస్ మాజీ చైర్మన్ కుడితి మహేందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఉప్పల నాగేశ్వరరావు, కౌన్సిలర్లు పానుగోత్ వెంకన్న, విసారపు ప్రగతిశ్రీపాల్ రెడ్డి , మాచర్ల భద్రయ్య, రేఖావెంకటేశ్వర్లు, సయ్యద్ లతీఫ్, మక్సూద్ పాల్గొన్నారు.

# హరిహర క్షేత్రంలో కన్ని స్వాముల పూజ

## శరణుఘోషతో మార్మోగిన ఆలయం

తొర్రూరు, డిసెంబర్ 4 : కార్తీక మాసం వచ్చిందంటే పలు పర్వదినాలతోపాటు అయ్యప్ప భక్తుల భక్తితత్వం కనబడుతుంది. కార్తీక మాసం నుంచి మార్గశిర మాసం వరకు అయ్యప్ప భక్తులు మాలధారణ చేసుకుని స్వామి దీక్ష పూనుతారు. అయ్యప్పస్వామికి ఎంతో ఇష్టమైన మొదటిసారి మాలవేసుకొనే భక్తుడు కన్ని స్వామిగా పిలవబడుతాడు. తెలుగు రాష్ట్రాల్లోనే మొదటి సారిగా ప్రత్యేకంగా సామూహిక కన్నిస్వాముల పూజను మహబూబాబాద్ రోడ్డులోని పదినెట్టాంబడితో కూడిన హరిహర క్షేత్రం అయ్యప్ప దేవాలయంలో దేవాలయ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో ఆనవాయితీగా నిర్వహిస్తున్నారు. ఆలయ నిర్వహణ కమిటీ దారం ప్రసాద్–లత దంపతుల ఆధ్వర్యంలో వైభవంగా ఈ పూజను నిర్వహించారు. మాజేటి నరసింహారావు గురుస్వామి ఆధ్వర్యంలో ముందుగా వినాయకుడికి, సుబ్రహ్మణ్యస్వామికి, మహాశివుడు, వేంకటేశ్వరస్వామికి అష్టోత్తర శతనామావళి పూజను చేశారు. అనంతరం హరిహర సుతుడు అయిన శ్రీధర్మశాస్త్రకు అంగపూజ, అష్టోత్తర శతనామావళి, స్వామివారికి పంచామృత అభిషేకం, సుగంధ ద్రవ్యాలతో పసుపు కుంకుమ, గంధం, విభూది, వివిధ రకాల పండ్లతో అభిషేకాలను చేశారు. అనంతరం నైవేద్యాలను నివేదించి 18 మెట్ల పూజ చేసి, పళ్లతో కర్పూరాన్ని వెలిగించి హారతి ఇచ్చారు. అనంతరం స్వాములకు మహా అన్నదానం చేశారు. ఈ సందర్భంగా గురుస్వామి నరసింహారావు మాట్లాడుతూ దీక్ష చేపట్టిన వారు అయ్యప్ప ఆశీస్సులు పొందుతారని, కులాలకతీతంగా, వయోభేదం లేకుండా మాల వేసుకున్న ప్రతి ఒక్కరూ స్వామి అని పిలిపించుకుంటారని అన్నారు. ఆలయ నిర్వాహకులు, సభ్యులు, ట్రస్టు సభ్యు లు సీహెచ్ సతీశ్, బిజ్జాల వెంకటరమణ, వల్లపు మధు, తల్లాడ హీరాధర్, ఇమ్మడి రాంబాబు, దొడ్డ రఘు, కమల్ సింగ్, మధుశర్మ, నంబూద్రితో పాటు శివ, రాకేశ్‌శర్మ, సుమారు వెయ్యి మంది స్వాములు పాల్గొన్నారు.



హరిహర క్షేత్రం అయ్యప్పస్వామి దేవాలయంలో కన్ని స్వాముల పూజలో పాల్గొన్న స్వాములు